క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

బైరెడ్డిపల్లి: యువభారత్ అసోసియేషన్, ఎస్వై కేఎస్ సొసైటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లోని విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు వేకాంత్ మాట్లాడుతూ గెలుపోటములు సహజమన్నారు. ఓటమి చెందామని నిరాశపడకుండా మళ్లీ క్రీడల్లో పాల్గొన్నప్పుడే విజయం సాధించడానికి వీలవుతుందన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. గణేష్, గోవిందప్ప పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

బైరెడ్డిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వీధి దీపాలు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పరిశీలన అంశాలపై మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఘన వ్యర్థాల నిర్వహణపై బైరెడ్డిపల్లె ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద తడి, పొడి చెత్తలను వేరు చేసి వాటి ద్వారా వర్మికంపోస్టును తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, ఎంసీఓ సురేష్‌బాబు, రిసోర్స్‌పర్సన్లు సద్గుణ, మహేష్ పాల్గొన్నారు.

దిగువ చదళ్లలో నాగదేవతల ప్రతిష్ట



ప్రతిష్టించిన నాగదేవతలు

పుంగనూరు: మండలంలోని దిగువ చదళ్ల గ్రామంలో గ్రామస్తులు బుధవారం నాగదేవతల ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామాలు, ప్రజల అభివృద్ధికి నాగదేవతలను ప్రతిష్టించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గ్రామస్తులు కలసి నాగదేవతలను గ్రామంలో ప్రతిష్టించారు. ఉదయం నుంచి హోమాలు, పూజలు నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై నాగదేవతలకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామదేవతలకు మండల పూజ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పలమనేరు డీఎస్పీగా ప్రభాకర్



పలమనేరు: పలమనేరు డీఎస్పీగా రాజమండ్రి నుంచి ప్రభాకర్ ఇక్కడికి బదిలీపై రానున్నారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన విష్ణురఘువీర్ సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడకు బదిలీ అయ్యారు. ప్రభాకర్ త్వరలో ఇక్కడ విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

వీధికుక్కల పట్టివేత



పట్టణంలో వీధి కుక్కలను పడుతున్న దృశ్యం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కల పట్టివేత కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. అనిమల్ క్యార్‌ల్యాండ్ తిరుపతి వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి 31 కుక్కలను పట్టి వాటికి స్టెరిలైజేషన్ చేసి ఆపై విడిచిపెట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పర్యవేక్షించారు.

ఆర్డీఓ కార్యాలయం తనిఖీ

పలమనేరు: పలమనేరు ఆర్డీఓ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, తహసీల్దార్లతో రెవెన్యూ సదస్సులు, ఇతర విషయాలపై చర్చించి కుప్పానికి బయలుదేరి వెళ్లారు.

హాస్టళ్లలో పిల్లలకు ఇబ్బందులుండకూడదు



హాస్టళ్ల సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు: సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాస్టల్ వార్డెన్లకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాయంలో నియోజకవర్గ ప్రభుత్వ వసతి గృహాల సలహా సంఘ సమావేశం బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ హాస్టళ్లల్లో సౌకర్యాలు, మెనూ, వారి భద్రతపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీపీ రోజా, ఎస్‌డబ్ల్యూఓ హైమావతి, బీసీడబ్ల్యూఓ జగ్గయ్య, ఎంపీడీఓ రాజేష్, ఎంఈఓ బాలసుందరం, వార్డెన్లు పాల్గొన్నారు.

ఎటుచూసినా అసాంఘిక కార్యకలాపాలే!

- అడ్డాగా పట్టణ ఆవాసాలు
- వ్యసనాలకు బానిసల్లా కొందరు యువత
- కన్నడ మత్తు, ఆపై గంజాయి మత్తుకు చిత్తు
- అదే సమయంలో కక్షలు, కార్పణ్యాలు



చెత్తపెంట వద్ద పోలీసులు గతంలో గుర్తించిన గంజాయి మొక్కలు(ఫైల్)

పలమనేరు: పలమనేరు పట్టణ ఆవాస ప్రాంతాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. పట్టపగలే యువత గుంపులు గుంపులుగా మద్యం తాగడం, ఆపై మొబైల్ జూదం, కొందరు గంజాయి సేవించడం పరిపాటిగా మారింది. కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తెచ్చి విక్రయించే ముఠాలు స్థానికంగా ఎక్కువయ్యారు. దీంతో మత్తుకు బానిసైన వీరు గొడవలకు దిగడం సర్వసాధారణమైంది. ముఖ్యంగా కొంతమంది యువకులు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తూ వారి భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకుంటున్నారు. ఇటీవల స్థానిక పోలీసులు, సెబ్ అధికారులు కలసి చెత్తపెంట వద్ద పెంచిన గంజాయి మొక్కలను గుర్తించి వెంటనే సీజ్ చేసిన విషయం తెలిసిందే. కొన్ని దాబాల వద్ద తాగి పడేసిన గింజలు వర్షానికి మొలకెత్తి మొక్కలు మొలిచాయంటే ఇక్కడ గంజాయి వినియోగం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రకరకాల కార్యకలాపాలు..

మొబైల్ ఫోన్లలో జూదానికి సంబంధించి పలు ఆటలను జట్టుగా ఆడుతుంటారు. ఇందులో స్పాట్ బెట్టింగ్ పేరిట వేలాది రూపాయల లావాదేవీలు గంటల వ్యవధిలో సాగుతుంటాయి. ఇక గంటావూరు సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద నున్న అడవుల్లో రహస్యంగా పేకాట ఆడేవాళ్లున్నారు. మత్తుకు అలవాటు పడిన కొందరు గంజాయిలాగడం కోసం ఈ ప్రాంతాలకు చేరుకుంటారు. ఖాళీ స్ప్రైట్ బాటిల్‌కు రంధ్రం పెట్టి దాంట్లో గంజాయిని పెట్టి లాగడం ఇక్కడో ఫ్యాషన్‌గా మారింది. కొంతమంది విద్యార్థులు సైతం ఈ అలవాటుకు బానిసలు కావడం బాధాకరం. ఇక మద్యం పార్టీల గురించి చెప్పనవసరం లేదు. ఈప్రాంతాల్లోని తోపులు, చెరువులు, గుట్టలకింద ఎటుచూసినా కర్ణాటకకు చెందిన టెట్రా ప్యాకెట్లు కనిపిస్తుంటాయి. ఇంకొందరు ఏకాంతంగా స్మార్ట్‌ఫోన్‌లో వీడియో గేమ్స్‌తో లోకాన్నే మరిచిపోతున్నారు. ఎక్కడెక్కడ ఇలాంటి స్పాట్‌లున్నాయో తెలిసిన మరికొందరు బైక్‌లపై అక్కడికే వెళ్లి కన్నడ మద్యం అమ్మకాలు చేస్తున్నారు.

ఈ ప్రాంతాలు ఎక్కడెక్కడంటే..

పట్టణ సమీపంలోని రొంటకుంట్ల రోడ్డు మార్గానికి ఇరువైపులా, ఎద్దుల చెరువు వెనుక పట్టుగూళ్ల యూనిట్ ప్రాంతం, మార్కెట్‌లోని వెనుకభాగం, గాంధీనగర్‌కు వెనుకవైపున్న పొలంగట్లు, గంగవరం బైపాస్ రోడ్డు సమీప ప్రాంతాలు, గంటావూరు కాలనీ ఆవాసాలు, ఆంజనేయస్వామి ఆలయానికి ఉత్తరం, దక్షిణం ఉన్న అటవీప్రాంతం, గాంధీనగర్ అడవిదారి, గంటావూరు, గొబ్బిళ్లకోటూరు సమీపంల్లోని చెరువులు, చిట్టడవి, డంపింగ్‌యార్డు రోడ్డు, టీఎస్ అగ్రహారం రోడ్డులోని ఘోరీతోపు, డిగ్రీ, జూనియర్ కళాశాల మైదాన ప్రాంతాలు, ఫైర్ ఆఫీసుకు ముందువెళ్లే కాలిబాట, అక్కడి ఆవాస ప్రాంతాలు, బేరుపల్లి మలుపు, తావడపల్లి రోడ్డు, గడ్డూరు కాలనీకి తూర్పువైపున్న శ్మశాన ప్రాంతం, గుట్టల్లో ఎటుచూసినా గుంపులుగా యువత అసాంఘిక కార్యకలాపాల్లో తలమునకలై ఉంటారు.

పోలీసులు నిఘా ఉంచాలి..

గతంలో స్థానిక పోలీసులు బ్లూకోట్స్ పేరిట రెండు బైక్‌ల్లో పట్టణ ఆవాసాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలపై కన్నేసేవారు. అయితే ఇప్పుడు ఇదే వ్యవస్థ ఉన్నా పెద్ద పటిష్టంగా లేదని తెలుస్తోంది. అయితే సీఐగా నరసింహరాజు ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికైనా పట్టణ ఆవాసాలపై తమ సిబ్బంది ద్వారా నిఘా పెట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.




గంజాయి పీల్చే బాటిళ్లు

కక్షలు, కార్పణ్యాలు ఇక్కడి నుంచే..

తొలుత కాలక్షేపం కోసం చేరే గ్యాంగ్‌లు ఆపై మద్యం, గంజాయి మత్తులో గొడవలకు దిగడం షరామామూలుగా మారుతోంది. ముఖ్యంగా రెండు నెలల నుంచి గంటావూరులో ఇలాంటి గ్రూపు గొడవలు, కక్షలు ఎక్కువయ్యాయి. ఈప్రాంతాలకు సమీపంలోని దాబాల నుంచి కావాల్సిన మాంసాహారాన్ని తెప్పించుకోవడం, టెట్రా ప్యాకెట్లను సేవించి కొట్టుకోవడం తరచూ జరుగుతూనే ఉంటుంది. స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరే పలు కేసులకు మూలాలు మాత్రం పట్టణ ఆవాసాల్లో జరిగిన గొడవలు, వాగ్వాదాలే కారణమని తెలుస్తోంది.

గ్రామ సభలు రేపు

గంగవరం: మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ లేబర్ బడ్జెట్ 2014–25 వార్షిక సంవత్సరంలో చేపట్టే పనులను గుర్తించి ప్రణాళికలు తయారు చేసుకునేందుకు అన్ని పంచాయతీల్లో రేపు శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఎంఈడీఓ మధుసూదన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభల్లో అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో పాటు ప్రజలు భాగస్వాములై చేపట్టాల్సిన పనులను చర్చించి ఆమోదం పొందాల్సి ఉందన్నారు. కావున మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలకు ప్రజలు హాజరవడం కోసం ముందుగా దండోరా ద్వారా చాటింపు వేయాలన్నారు. ఈ సభలో ఉపాధి పథకానికి సంబంధించి ఈ వార్షిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులకు లేబర్ బడ్జెట్ తయారు చేసుకుని గుర్తించిన పనులను అన్యెగ్జర్ 11లో పొందు పరచాలన్నారు. గ్రామ సభలో ఆమోదం పొందిన తరువాత సభ ఫొటోలు, తీర్మానాలను గ్రామ సభ యాప్‌లో అప్లోడ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

ఓటర్ల జాబితా పరిశీలన



ఇంటింటికెళ్లి వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్

చౌడేపల్లె: ఓటరు జాబితాను తహసీల్దార్ హనుమంతునాయక్ ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. బుధవారం చౌడేపల్లె టౌన్‌లోని పలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లతో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఓటర్ల వివరాలు, వారి ఆధార్ కార్డుల వివరాలను పరిశీలించారు. ప్రతి గ్రామంలోనూ ఇదే తరహాలో రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు కలసి పరిశీలన చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వీఆర్వో నాగేంద్రనాథ్‌రెడ్డి, బీఎల్‌ఓ సుమతి పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లపై మున్సిపల్ కొరడా

- ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వం
- క్రయ విక్రయాలు నిషేధం
- కమిషనర్ నరసింహప్రసాద్



కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న అక్రమ లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేది లేదని, ఈ ప్రాంతాల్లో క్రయ విక్రయాలు నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ బుధవారం తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీలో అక్రమ లేఔట్ల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీలో అక్రమ లేఔట్లను సర్వేచేసి గుర్తించామన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 17 అక్రమ లేఔట్లను గుర్తించామని తెలిపారు. మిగిలిన వాటిపై కూడా సర్వే చేసి, నిషేధిత జాబితాలో చేర్చేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపుతున్నామని చెప్పారు. గుర్తించిన అక్రమ లేఔట్ల వివరాలు కుమ్మరవీధి, మేలుపట్ల, తాటిమాకుల పాళెం, యూఎస్‌ఆర్ సర్కిల్ వద్ద, రహమత్‌నగర్, బైపాస్‌రోడ్డు, భగత్‌సింగ్‌కాలనీ, రాగానిపల్లి రోడ్డు, మినీబైపాస్ రోడ్డు, వివేకానంద కాలనీ, వనమలదిన్నె రోడ్డు, రామసముద్రం రోడ్డు ప్రాంతాల్లో అక్రమ లేఔట్లను గుర్తించామని పేర్కొన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో అక్రమ లేఔట్లపై నిషేధం విధించామన్నారు. భూయజమానులు సంబంధిత లేఔట్లను ప్రభుత్వ నిబంధనల మేరకు రుసుము చెల్లించి, క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లేకపోతే వ్యాపార లావాదేవీలు నిషేధించడంతో పాటు కొనుగోలు దారులకు ఖాళీజాగా పన్నులు, ఇళ్ల నిర్మాణాలు అనుమతులు, మౌలిక వసతులు కల్పించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రజలు జాగ్రత్త వహించి, ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయాలని సూచించారు. అక్రమ లేఔట్లలో వ్యాపారాలు నిర్వహిస్తే తీవ్రంగా నష్టపోతారని సూచించారు. ఈ మేరకు అక్రమ లేఔట్లపై బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా అక్రమ లేఔట్లపై మున్సిపాలిటీ కొరడా ఝులిపించడంతో రియల్టర్లలో గుబులు ప్రారంభమైంది. దీని కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా కుప్పకూలింది.

చేపల అక్రమ వేట నిషేధించాలి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి, మోహన్

పుంగనూరు: చెరువులు, కుంటలు, కాలువల్లో చేపలను అక్రమంగా వేటాడి పట్టుకునే వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం మత్స్యకారుల సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బెస్త కులస్తులకు జీవనాధారమైన చేపలు పట్టుట, విక్రయించుట హక్కుగా అభివర్ణించారు. కొంత మంది బెస్తవారి హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా చేపలను వేటాడే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే పట్టణంలో చేపల విక్రయ దుకాణాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన చేపల మాంసాన్ని విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కామేశ్వరరావు, కుమార్, దొరస్వామి, రఘుబాబు, ప్రకాష్, చంద్ర, మోహన్ పాల్గొన్నారు.

సింగిల్ ఫేజ్ కరెంట్‌కు చర్యలు

–ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో గ్రామాల్లో కరెంట్ కోతలు లేకుండా ఆర్‌డీఎస్‌ఎస్ స్కీమ్ ద్వారా సింగిల్ ఫేజ్ కరెంట్ ఉన్న గ్రామాల్లోనూ అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు స్థానిక ఏడీ చిన్నబ్బ బుధవారం తెలిపారు. సాక్షిలో బుధవారం ప్రచురితమైన 'వానల్లోనూ కోతలు' కథనంపై ఆయన మాట్లాడుతూ తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా వృక్షాలు పెరిగి లైన్లకు అడ్డుగా ఉండే వాటిని తొలగించేందుకు అప్పుడప్పుడు కరెంట్ ఆఫ్ చేస్తున్నామని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికలను జెడ్పీ చైర్మన్‌కు అందిస్తున్న సభ్యులు

వి.కోట: ఈనెల 26వ తేదీ నుంచి మండలంలోని రామాపురంలో నిర్వహించే శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు ప్రభోదసేవా సమితి వారు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులకు ఆహ్వానం పలికారు. బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామం జెడ్పీ చైర్మన్ క్యాంప్ ఆఫీస్‌లో ప్రభోదసేవా సమితీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి వేడుకులకు ఆహ్వానం పలికారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండల ప్రభోదసేవా సమితీ సభ్యులు నిర్వహించే వేడుకల్లో ప్రజలు పాల్గొని శ్రీ కృష్ణుడి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. ప్రభోద సేవా సమితి మండల అధ్యక్షుడు అశోక్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోండి



నిరసన ర్యాలీలో న్యాయవాదులు, ఆస్పత్రి సిబ్బంది

పలమనేరు: కోల్‌కతా ట్రైనీ డాక్టర్ ఘటనకు సంబంధించి అసలైన నిందితులను కనిపెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక న్యాయవాదులు ఆస్పత్రి వైద్యులతో కలసి పట్టణంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి, కార్యదర్శి భర్కర్, న్యాయవాదులు, ఆస్పత్రి మెడికల్ సూపరిండెంటెంట్ మమతా రాణి, ఆర్ఎంఓ శారద వైద్యులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



వానరానికి అంత్యక్రియలు చేస్తున్న వేణు

వి.కోట: ఎవరికో ఏదో అయితే మనకేంటి మన పని మనది అనుకునే ఈ రోజుల్లోనూ జంతువులు చనిపోతే వాటికి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు చేయడం చలింపచేసింది. విద్యుత్ షాక్‌కు గురైన ఓ వానరానికి అంత్యక్రియలు జరిపి మానవనీయతను చాటుకున్న సంఘటన పట్టణంలో అందరినీ చలింపజేసింది. పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ముందు మంగళవారం రాత్రి ఒక వానరం విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. గమనించిన స్థానికులు విషయాన్ని వి.కోట అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు వేణుకు తెలిపారు. వెంటనే స్పందించిన వారి బృందం వానరాన్ని తీసుకెళ్లి సంప్రదాయ పద్ధతిలో ఊరి బయట అంత్యక్రియలు నిర్వహించి మానవనీయతను చాటుకున్నారు. స్థానికులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నానో యూరియాతోనే అధిక లాభం

–ఇఫ్‌కో రాష్ట్ర అధికారి శ్రీధర్‌రెడ్డి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీధర్‌రెడ్డి

పలమనేరు: నానో యూరియా, డీఏపీ ఎరువులదే భవిష్యత్తని ఇఫ్‌కో రాష్ట్ర అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నానో ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమం పట్టణ సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం జరిగింది. ఇందుకు పట్టుపరిశ్రమ శాఖ అధికారులు, నియోజకవర్గంలోని పట్టురైతులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నానో యూరియా సాధారణ యూరియా బస్తాల్లా బరువు ఉండదన్నారు. ఇది బాటిల్ రూపంలో ఉంటుంది కాబట్టి సులభంగా రవాణా చేసుకోవచ్చన్నారు. రైతులు కొన్న ఇఫ్‌కో నానో ఎరువులపై రైతులకు రూ.10వేల ఉచిత ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఇది గరిష్టంగా రూ.2 లక్షల దాకా ఉంటుందని తెలిపారు. అనంతరం రిటైర్డ్ సిరికల్చర్ సైంటిస్ట్ డా.సుబ్రమణ్యం పట్టు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పలమనేరు, కుప్పం ఏడీలు కిశోర్‌నాయక్, హనుమంత్‌నాయక్, ఇఫ్‌కో జిల్లా అధికారి దిలీప్‌కుమార్, మణిచంద్ర, సీఆర్పీ కృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా



పుంగనూరు: ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ నేతలు

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ, జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్, అంబేడ్కర్ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.శంకరప్ప, సంఘ ప్రతినిధులు శ్రీనివాసులు, రెడ్డి, నాగరాజ, ఆనంద పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ హనుమంతునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. నేతలు శివకుమార్, మణి, ఈశ్వర్, రెడ్డిప్రసాద్, శ్రీరాములు పాల్గొన్నారు.

శాంతిపురంలో..

శాంతిపురం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో శాంతిపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు చేతపట్టుకుని నిరసన తెలిపారు. సంఘ జిల్లా కార్యదర్శి రాజు, మండల అధ్యక్షుడు అంబేడ్కర్, నేతలు గోవిందప్ప, శ్రీనివాసులు, మునివెంకటప్ప పాల్గొన్నారు.

రామకుప్పంలో

రామకుప్పం: స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి దళిత సమాఖ్య ఆధ్వర్యంలో నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. నేతలు బుర్రా సతీష్, పెనువేలు సింహ, రమణ, విజయ్, దయానందం పాల్గొన్నారు.




చౌడేపల్లె: రాస్తారోకో చేస్తున్న నేతలు, శాంతిపురం: అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన

పిచ్చుకగూళ్లు.. పక్షుల కిలకిలరావాలు




పలమనేరు: నేటి తరానికి పెద్దగా తెలియని పిచ్చుకగూళ్లు మళ్లీ చూసే భాగ్యం ప్రకృతి ప్రసాదించింది. పాతతరం వారి జీవనంలో పిచ్చుకగూళ్లు మమేకమై ఉండేవి. రైతులు తమ పొలం వద్ద వ్యవసాయపనులు చేసుకుంటుంటే బావుల వద్ద పొలం గట్లలోని చెట్లపై వేలాడుతున్న గూళ్లు కనిపించేవి. అత్యంత సొగసుగా కనిపించే వీటిలో రకరకాల పక్షులు కాపు రాలుండేవి. అయితే మారిన వాతావరణ పరిస్థితులు, సెల్‌ఫోన్ల రాకతో పెరిగిన సెల్‌టవర్ల కారణంగా వీటి ఉనికి ప్రశ్నార్థకమైంది. ఇలాంటి తరుణంలో కోవిడ్ కారణంగా వాతావరణ కాలుష్యం బాగా తగ్గింది. వర్షాలు కురుస్తున్నాయి. దీంతో బావులు, చెరువులకు నీళ్లు వచ్చాయి. చెట్టుచేమ పచ్చగా కలకలలాడుతున్నాయి. దీంతో పిచ్చుకలే కాదు రకరకాల పక్షుల కిలకిలారావాలు మళ్లీ వినిపిస్తున్నాయి. చెరువులకింద, పచ్చటి చెట్లపై మళ్లీ గూళ్లు దర్శనమిస్తున్నాయి. పలమనేరు మండలంలోని బేలుపల్లి చెరువు కట్టకింద, పెద్దపంజాణి మండలం పెనుగొలకల ప్రాంతంలో చెట్లకు వేలాడుతున్న పిచ్చుకగూళ్లు అందరినీ ఆకర్షిస్తున్నాయి. నేటితరం పిల్లలకు పెద్దలు వీటిని చూపెట్టి వివరిస్తున్నారు.